జైత్ర
మల్టీ స్పెషాలిటీ
హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి
# శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥ సంపుటి:1 ॥ సంచిక: 34 ॥ శుక్రవారం ॥ 3-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-





స్పీడ్ పోస్టు ద్వారా దేశవ్యాప్తంగా గంజాయి సరఫరా చేస్తున్న

## ముఠా గుట్టురట్టు

**సూత్రధారి అరెస్ట్.. నలుగురు పరారీలో**

దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్టు, కొరియర్ సేవలను వినియోగిస్తూ గంజాయి అక్రమ రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-న్యూ) అధికారులు ఛేదించారు.

హైదరాబాద్, జూలై 2 : ఈ కేసులో ప్రధాన సూత్ర ధారి జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్టు చేయగా, అతని అన్న శుభమ్ మిశ్రా అలియాస్ శుభమ్ దాదా అలియాస్ భయ్యా, రాహుల్ ఝా అలియాస్ చోటే మిశ్రా, సచిన్ మిశ్రా, ముంబై నెట్‌వర్క్ సమన్వయ కర్త సంతోష్ పండిట్ పరారీలో ఉన్నారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు ప్రతిరోజూ 80 నుంచి 100 వరకు గంజాయి ఆర్డర్లను సరఫరా చేస్తుండగా, అందులో 8 నుంచి 10 పార్సిళ్లను స్పీడ్ పోస్టు ద్వారా పంపుతున్నట్లు గుర్తించారు. అనుమానం రాకుండా పార్సిళ్లలో "మందులు" ఉన్నట్లు తప్పుడు వివరాలు నమోదు చేసేవారు. వినియోగదారులు -2వ పేజీలో




# మూసీ ఫేజ్-1కు.... 7,345 కోట్లు

## విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ అల్పాహారం-మధ్యాహ్న భోజనం

### టిమ్స్‌లో 6,278 పోస్టులు.. వీబీజీ రామ్‌జీ పథకంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం

# రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయం

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావే శం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే చారిత్రాత్మక నిర్ణయాన్ని మంత్రి వర్గం ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

హైదరాబాద్, జూలై 2 : మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయా లను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వివరిం చారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజ రు పెంపు, పోషకాహార లోపం నివారణ, ఉపాధ్యాయులు--సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలోనే వినూత్న సంక్షేమ కార్యక్రమంగా ఇది నిలుస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. వీబీజీ రామ్‌జీ పథకంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న రాష్ట్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్‌జీ పథకంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. ఈ అంశాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నివేదికను సమావేశంలో పరిశీలించారు. ఈ పథకాన్ని రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని నిర్ణయించిందని, రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని మంత్రులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పథకంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి నష్టం కలగకుండా ఉండేందుకు గత్యంతరంలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో కూడా ఆ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రివర్గం భావించినట్లు తెలిపారు.



## సంక్షేమ టెండర్లు-రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లు

### గన్‌పార్క్, తెలంగాణ భవన్‌ల వద్ద హైడ్రామా.. నేతల నిర్బంధం

సంక్షేమ శాఖ టెండర్లలో అక్రమాలు, రాష్ట్ర అప్పుల అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య గురువారం రాజధాని హైదరాబాద్‌లో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. గన్‌పార్క్, తెలంగాణ భవన్ కేంద్రాలుగా ఇరు పార్టీల నేతలు ఒకరిపై ఒకరు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకోవడంతో హైడ్రామా చోటుచేసుకుంది.

హైదరాబాద్, జూలై 2 : బీఆర్ఎస్ విసిరిన బహిరంగ చర్చ సవాల్‌ను స్వీకరించిన మంత్రు లు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్ గన్‌పార్క్‌కు చేరుకున్నారు. అయితే బీఆర్ఎస్ నేతలు అక్కడికి రాకపోవడాన్ని వారు ప్రశ్నించారు. బీఆర్ఎస్ తరఫున ఎవరైనా మాజీ మంత్రి వచ్చినా చర్చకు సిద్ధమే నని, అవసరమైతే సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లోనూ చర్చ నిర్వహించవచ్చని ప్రకటించారు.

ఇదే సమయంలో మాజీ మంత్రి టి. హరీశ్‌రావు తెలంగాణ భవన్ నుంచి గన్‌పార్క్‌కు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మాజీ మంత్రులు టి. హరీశ్‌రావు, వి. శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు పార్టీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని గన్‌పార్క్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, రాష్ట్ర అప్పుల అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వంతో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, అయితే కాంగ్రెస్ మంత్రులకు (మిగతా 2వ పేజీలో)



## రుణాలపై చర్చకు వెనక్కి తగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం

### కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, జూలై 2 : రాష్ట్ర అప్పులపై బహిరంగ చర్చకు సవాల్ విసిరిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరకు పిరికితనంతో వెనక్కి తగ్గిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే . టీ . రామ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. (గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వ పిరికితనాన్ని ప్రత్యక్షంగా చూశారని అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తెలంగాణ భవన్‌కు వస్తానని (మిగతా 2వ పేజీలో)



## ఏజెన్సీ ప్రాంతాలకు అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించాలి

### గిరిజన ఎమ్మెల్యేల వినతి

హైదరాబాద్, జూలై 2 : ఏజెన్సీ ప్రాంతాల నియోజకవర్గాలకు అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి ఏ . రేవంత్ రెడ్డి ను కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన ఎమ్మెల్యేలు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును పెంచడంతో పాటు, పోడు భూములకు పట్టాలు మంజూరు (మిగతా 2వ పేజీలో)

## తవ్విన రోడ్లు.. తల్లడిల్లుతున్న సూర్యాపేట

### అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులతో రహదారులన్నీ గుంతలమయం

**ఎక్కడ వాహనం దిగబడుతుందోనని ప్రజల్లో భయం.. ప్రజాప్రతినిధులపై తీవ్ర అసంతృప్తి**



సూర్యాపేట, జూలై 2 : సూర్యాపేట పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల పేరుతో నెలల తరబడి తవ్విన రహదారులు ప్రజలకు నిత్య నరకంగా మారాయి. ఎక్కడ చూసినా గుంతలు, కంకర, మట్టి పేరుకుపోవడంతో రహదారులు ప్రయాణానికి ప్రమాదకరంగా మారాయి. గురువారం పట్టణంలో ఇసుకతో వెళ్తున్న ఒక ట్రాక్టర్ రోడ్డు కుంగిపోవడంతో చక్రం పూర్తిగా దిగబడిపోయిన ఘటన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పకనే చెబుతోంది. పట్టణంలోని ప్రధాన (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

**మేషం :** లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి. వ్యాపారంలో కాలం అనుకూలంగా ఉంది. కీలక విషయాల్లో తోటివారి సలహాలు అవసరం. మనోధైర్యంతో తీసుకున్న నిర్ణయాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో అధికారులతో జాగ్రత్త అవసరం. సూర్యారాధన శుభప్రదం.

**వృషభం :** కాలం మిశ్రమంగా ఉంది. మనోబలంతో చేసే పనులు ఫలిస్తాయి. ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటే మేలు జరుగుతుంది. ముఖ్య వ్యవహారాల్లో బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. నవగ్రహ ధ్యాన శ్లోకాలు శుభప్రదం.

**మిథునం :** మనోబలంతో చేసే ప్రయత్నాలు విజయాన్ని ఇస్తాయి. ఉత్సాహంగా ముందుకు సాగితే కాలం సహకరిస్తుంది. ఉద్యోగంలో అనుకున్నది సాధిస్తారు. కుటుంబ సభ్యుల సమస్యలు కొంత ఆందోళన కలిగించవచ్చు. వ్యాపారంలో మంచి అవకాశాలు ఉన్నాయి. సూర్యధ్యానం శుభప్రదం.

**కర్కాటకం :** అనుకున్న పనులు సక్రమంగా పూర్తవుతాయి. మనోధైర్యమే మీకు ప్రధాన బలం. కీలక వ్యవహారాల్లో కుటుంబ సభ్యుల సహకారం మేలు చేస్తుంది. పట్టుదలతో పనిచేస్తే మంచిపేరు వస్తుంది. ఉద్యోగ,వ్యాపారాల్లో అనుభవజ్ఞుల సూచనలు ఉపయోగపడతాయి. నవగ్రహ ఆరాధన శ్రేయస్సును ఇస్తుంది.

**సింహం :** ప్రతి పనిలో పట్టుదల అవసరం. పనులు ఆలస్యం జరగకుండా ముందుచూపుతో వ్యవహరించాలి. ఏకాగ్రత లేకపోతే పని పునరావృతం అవుతుంది. అజాగ్రత్తకు తావివ్వకండి. నవగ్రహ ధ్యాన శ్లోకాలు పఠనం శుభకరం.

**కన్య :** ప్రారంభించిన పనుల్లో జాగ్రత్త అవసరం. బద్ధకించకుండా పనులు వెంటనే పూర్తి చేయాలి. అధికారులను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించాలి. క్రమంగా సమస్యలు తగ్గుముఖం పడతాయి. మనోధైర్యం పెరుగుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం శుభప్రదం.

**తుల :** కాలం శుభప్రదంగా ఉంది. ఏ పని చేసినా త్వరగా పూర్తవుతుంది. సమాజంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగ,వ్యాపారాల్లో అనుకున్నది దక్కుతుంది.ఒక సంఘటన మానసిక బలాన్ని పెంచుతుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన మేలు చేస్తుంది.

**వృశ్చికం :** ఆర్థిక వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగ,వ్యాపారాల్లో శుభఫలితాలు ఉన్నాయి. సౌభాగ్యసిద్ధి కలుగుతుంది. ఒక ముఖ్యమైన సమస్య పరిష్కారం అవుతుంది. సమయానికి సహాయం అందుతుంది. దుర్గాదేవి నామస్మరణ మేలు చేస్తుంది.

**ధనుస్సు :** కాలం మిశ్రమంగా కొనసాగుతోంది. శ్రమతో కూడిన ఫలితాలు లభిస్తాయి. ఒక వ్యవహారంలో తోటివారి నుంచి సహాయం ఉంటుంది. కుటుంబ విషయాల్లో జాగ్రత్త అవసరం. అభిప్రాయ భేదాలు రాకుండా చూసుకోవాలి. దుర్గా స్తోత్ర పఠనం మేలు చేస్తుంది.

**మకరం :** వృత్తి, ఉద్యోగాల్లో శుభఫలితాలు ఉన్నాయి. సకారాత్మక ఆలోచనలు విజయాన్నిఇస్తాయి. ప్రారంభించిన పనిలో విజయం లభిస్తుంది. కుటుంబంలో శుభవార్త ఆనందాన్ని నింపుతుంది. ఒక ముఖ్య వ్యవహారంలో సహాయం లభిస్తుంది. శివారాధన శ్రేయస్కరం.

**కుంభం :** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ముందుచూపు అవసరం. మీ పనులకు దైవబలం తోడుంటుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. కీలక సందర్భాల్లో సలహాలు మేలు చేస్తాయి. నమ్మకంతో ముందుకు సాగాలి. శ్రీలక్ష్మీ ధ్యానం శుభప్రదం.

**మీనం :** ఆత్మవిశ్వాసం మిమ్మల్ని కాపాడుతుంది. ఉద్యోగంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధువుల ప్రేమాభిమానాలు లభిస్తాయి. భోజన సౌఖ్యం కలుగుతుంది. మానసిక ఉల్లాసం పెరుగుతుంది. ఈశ్వరధ్యానం శుభకరం.



# రుణాలపై చర్చకు వెనక్కి తగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

సవాల్ విసిరిన నేపథ్యంలో ఆయన కోసం ప్రత్యేకంగా కుర్చీ, శాలువా ఏర్పాటు చేసి మూడు గంటలకు పైగా ఎదురుచూశామని, కానీ మంత్రి రాకుండా ఎక్కడో హైడ్రామా నడిపించారని ఎద్దేవా చేశారు.

గన్‌పార్క్‌కు చర్చ కోసం వెళ్తున్న మాజీ మంత్రి టీ . హరీష్ రావు తో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా అభివర్ణించారు.

తాను గన్‌పార్క్‌కు కాలినడకన వెళ్తుండగా పోలీసులు గేటు వద్దే అడ్డుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చకు వచ్చే ధైర్యం ప్రభుత్వానికి లేదని, పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాన్ని అణచివేయడం ప్రభుత్వ నైతిక పతనానికి నిదర్శనమని విమర్శించారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన నాయకులను కలవడానికి కూడా అనుమతించకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు.

ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే వెంటనే శాసనసభ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. సభలో తమ మైకులు నిలిపివేయకుండా మాట్లాడే అవకాశం ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలు, అవినీతిని ప్రజల ముందుంచుతామని అన్నారు.

ప్రజల దృష్టిని పరిపాలనా వైఫల్యాలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలు అమలు చేయకపోవడం వంటి అంశాల నుంచి మళ్లించేందుకే ప్రభుత్వం "శిఖండి రాజకీయాలు" చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు.





# గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

వాట్సాప్ ద్వారా ఆర్డర్లు ఇవ్వగా, యూపీఐ ద్వారా చెల్లింపులు జరిపేవారు. ఈ ముఠా నెలకు రూ.30 నుంచి రూ.35 లక్షల వరకు ఆదాయం సంపాదిస్తూ, ఏడాదికి దాదాపు రూ.5 కోట్ల టర్నోవర్ సాధిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జార్ఖండ్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన గంజాయి పార్సిల్‌ను స్వాధీనం చేసుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన సుశాంత్ వ్యాస్, లడ్డూ అనే ఇద్దరు కొనుగోలుదారులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముంబై కేంద్రంగా వెయ్యి మందికిపైగా వినియోగదారులకు ఈ ముఠా గంజాయి సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. లావాదేవీల్లో "మ్యాంగో", "స్టిక్", "ఫ్లవర్" వంటి కోడ్ పదాలను ఉపయోగిస్తూ పోలీసులను మభ్యపెట్టే ప్రయత్నం చేసినట్లు అధికారులు తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా స్కానింగ్ లేకుండానే మాదకద్రవ్యాల పార్సిళ్లు రవాణా అవుతున్న భద్రతా లోపాన్ని కూడా పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరిగా స్కానింగ్ నిర్వహించేలా కేంద్ర సంబంధిత అధికారులకు సిఫారసు చేయనున్నట్లు హైదరాబాద్ నగర పోలీసులు తెలిపారు.

మాదకద్రవ్యాల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును వివిధ బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా మళ్లించి, బంగారం, విలాసవంతమైన వాహనాల కొనుగోలుకు వినియోగించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అన్ని కొరియర్ సంస్థలు పార్సిళ్లను తప్పనిసరిగా స్కాన్ చేయాలని, అనుమానాస్పద పార్సిళ్లు కనిపిస్తే వెంటనే డయల్-100 లేదా హెచ్-న్యూ హెల్ప్‌లైన్ 8712661601కు సమాచారం ఇవ్వాలని హైదరాబాద్ నగర పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ నేతృత్వంలోని 22 మంది హెచ్-న్యూ బృందాన్ని నగర పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ అభినందించారు.



# తవ్విన రోడ్లు..

(మొదటి పేజీ తరువాయి)

రహదారులతో పాటు కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు ఎప్పుడు జారి పడతామోనని భయంతో ప్రయాణిస్తున్నారు. సైకిళ్లపై వెళ్లే విద్యార్థులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ రహదారులన్నీ బురదమయంగా మారి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ ఇప్పటికే పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడంతో పాటు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్య వివరించాలని ప్రయత్నించినప్పటికీ, కమిషనర్ స్పందించలేదని పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఫ్లైఓవర్ నిర్మాణ పనులు కూడా సంవత్సరాలుగా నత్తనడకన సాగుతుండటంతో పట్టణ ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల్లో తిరుగుతూ అదనపు ఇంధనం ఖర్చు చేయాల్సి వస్తోంది. వేల రూపాయల విలువైన ఇంధనం వృథా కావడంతో పాటు ప్రజల విలువైన సమయం కూడా వృథా అవుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు సురక్షితమైన రహదారులు కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉందని, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాల్సిన బాధ్యత ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అయితే ఇరు వర్గాలు కూడా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. "ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను వేగంగా పూర్తి చేసి, రహదారులను యథాస్థితికి తీసుకురావాలి. లేకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రజలు హెచ్చరిస్తున్నారు."

## ఏజెన్సీ ప్రాంతాలకు అదనంగా 2 వేల ఇళ్లు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని, 'ఇందిరా గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని వారు కోరారు. అలాగే గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలను (ఐటీడీఏలు) మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ , పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు , ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు , ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు లతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ , మహమ్మద్ అజహరుద్దీన్ పాల్గొన్నారు.

## సంక్షేమ టెండర్లు-రాష్ట్ర అప్పులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆ ధైర్యం లేదని వ్యాఖ్యానించారు. దీనికి ప్రతిస్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు నిజమైతే చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్, హరీశ్‌రావు, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌లు సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన టెండర్లలో అవినీతి జరిగిందని చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని అన్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలిసే హక్కు ఉందని పేర్కొన్న ఆయన, నాలుగు శాఖల పర్యవేక్షణలో పూర్తి పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ నిర్వహించామని తెలిపారు. ఈ టెండర్లలో ఎవరైనా పాల్గొనే అవకాశం ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి చేపడుతున్న చర్యలను బీఆర్ఎస్ జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, సంక్షేమ శాఖ టెండర్లలో అక్రమాలు జరిగాయంటూ బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు కూడా బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. టెండర్ల మొత్తం విలువ రూ.1,143 కోట్లు మాత్రమే కాగా, రూ.2,000 కోట్ల అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని పేర్కొన్నారు.

మరోవైపు రాష్ట్ర అప్పులపై బీఆర్ఎస్‌ను చర్చకు ఆహ్వానించిన ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా గన్‌పార్క్‌కు చేరుకోగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో ఆయన కోసం ఎదురుచూశారు.

ఈ సందర్భంగా జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంపై రూ.8.21 లక్షల కోట్ల అప్పు మోపారని ఆరోపించారు. రాష్ట్ర అప్పు కేవలం రూ.3.5 లక్షల కోట్లు మాత్రమేనని కేటీఆర్ చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనన్నారు. తాను ఆర్థిక శాఖ అధికారుల అధికారిక లెక్కల ఆధారంగానే మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై వడ్డీ చెల్లింపులకే ప్రజల నుంచి వసూలు చేసే పన్నుల ద్వారా సుమారు రూ.1.8 లక్షల కోట్లు వెచ్చించాల్సి వస్తోందని మంత్రి పేర్కొన్నారు.

## బీసీలకు జనాభా నిష్పత్తిలో రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)

జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ అధికారం, శాసనసభల్లో ప్రాతినిధ్యం, పాలనలో వాటా దక్కాలన్న డిమాండ్‌తో తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం కొనసాగిస్తోందన్నారు. ఈ ఉద్యమంలో అన్ని సబ్బండ బీసీ కులాలు ఐక్యంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో జూలై 5, ఆదివారం భువనగిరిలో నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి బీసీలు, బహుజనులు, యువత, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు భారీ సంఖ్యలో తరలిరావాలని తీన్మార్ మల్లన్న విజ్ఞప్తి చేశారు.

"బీసీల వాటా బీసీలకే దక్కాలి... రాజకీయ అధికారమే సామాజిక న్యాయానికి మార్గం" అనే నినాదంతో భువనగిరి సభ చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

శ్వేత

సంపాదకీయం

**శుక్రవారం 3-7-2026**

# తెలంగాణలో సవాళ్ల రాజకీయాలు!

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సవాళ్లు ప్రతిసవాళ్లతో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. అధికార పార్టీని ఎండగట్టడమే పనిగా బిఆర్ఎస్ పనిచేస్తోంది. విపక్ష బిఆర్ఎస్ లక్ష్యంగా ఈ మధ్య సిఎం రేవంత్ కూడా ఘాటుగానే దాడి చేస్తున్నారు. ఎపిలో కూడా దాదాపు ఇదే తరహా రాజకీయాలు నడుస్తున్నాయి. జగన్ పార్టీని గొడ్డలి పార్టీ అంటూ అధికార టిడిపి దుమ్మెత్తి పోస్తోంది. జగన్ కూడా ఎపిలో చట్టాలకు విలువ లేకుండా పోయిందని అంటున్నారు. మొత్తంగా అభివృద్ధి, ప్రజల అవసరాలు పక్కకు పోయాయి. సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. తమ రాజకీయం కోసం రాష్ట్ర అభివృద్ధిని, పాలనను పక్కన పెట్టారు. ఇకపోతే తెలంగాణలో అంతకుమించి అన్నట్లుగా సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాజకీయాలు వేడెక్కాయి. ఇప్పుడే ఎన్నికలు లేవు. మరో రెండేళ్ల సమయం ఉంది. అయినా అప్పుడే ఎన్నికల వేడి పుట్టించేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీది రెండున్నరేండ్ల చెత్త పాలన అంటూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావులు విమర్శలు గుప్పిస్తున్నారు. బిఆర్ఎస్ అప్పులు చేసి, రాష్ట్రాన్ని ఆగం చేసిందని సిఎం రేవంత్ సహా మంత్రులు అడపాదడపా విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అక్రమాల పై లెక్కలతో పక్కాగా వివరిస్తామని ప్రతిగా బిఆర్ఎస్ నేతలు సవాళ్లు విసరుతున్నారు. అసెంబ్లీ లేకపోతే వేదిక ఏదైనా బీఆర్ఎస్ తరఫున తాను చర్చకు వస్తా.. రాహుల్‌గాంధీ వస్తారో? ఇంకెవరొస్తారో తేల్చుకోండి. మీ పాలనావైఫల్యాలను లెక్కలతో బయటపెట్టకపోతే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకొంటానని కెటిఆర్ చాలెంజ్ చేశారు.కాగా,కేటీఆర్ సవాల్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. తాను తెలంగాణ భవన్‌కు వస్తానని మంత్రి ప్రతి సవాల్ విసిరారు. మంత్రి చాలెంజ్‌ను స్వీకరించిన బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్‌లో మీ కోసం ప్రత్యేకంగా కుర్చీ రెడీగా ఉంది. మీదే ఆలస్యం దమ్ముంటే చర్చకు రావాలన్నారు. దీంతో ఒక్కసారిగా రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. అటు తెలంగాణ భవన్, ఇటు గాంధీ భవన్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జూపల్లి వ్యాఖ్యల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్ రావు బీఆర్ఎస్ భవన్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. జూపల్లి వస్తే కేంద్ర ప్రభుత్వ నివేదికలు, ఆర్‌బీఐ లెక్కలు, సాక్ష్యాలతో సహా వివరిస్తామని వారు తెలిపారు. కాగా, జూపల్లితో చర్చకు కేటీఆర్ అవసరం లేదని తాను సరిపోతానని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కావాలంటే కేటీఆర్ కూడా వస్తారన్నారు.

ఇలా రోజుకో సవాల్, ప్రతి సవాల్‌లో రాజకీయాలు నడుస్తున్నాయి. ఏ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. ఎన్ని నెరవేర్చారో చర్చకు బరాబర్ సిద్ధమేనన్నారు. కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని లెక్కలతో తిప్పికొడుతామన్నారు. సవాళ్లు, ప్రతి సవాళ్ల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు హాట్‌హాట్‌గా సాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి కూడా ప్రత్యర్థులకు చెక్ పెట్టేందుకు అడపాదడపా బిజెపి, బిఆర్ఎస్‌లను లక్ష్యంగా నేరుగా విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నా, అప్పుడే ఎలక్షన్ మూడ్ వచ్చేస్తున్నట్టు కనిపిస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు అదే తరహా ప్లానింగ్‌లో ఉన్నాయి. అందునా అధికారంలో ఉన్నాం కాబట్టి ఎక్కడా తగ్గకూడదన్న ఉద్దేశ్యం కాంగ్రెస్ పార్టీలో, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండోసారి అధికారం చేపట్టేందుకు అవసరమైన ఎత్తుగడలకు ఆయన పదును పెడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకంటే మళ్లీ కాంగ్రెస్ సర్కార్ వస్తుందని, తానే సిఎంనని పదేపదే ప్రకటిస్తున్నారు. ఇదంతాఒక ఎత్తయితే విపక్ష బిఆర్ఎస్, బిజెపిలను దెబ్బకొట్టడంతో పాటు, బలంగా లేని చోట కాంగ్రెస్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారని తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ ఎక్కడైతే బలంగా లేదో అక్కడి నుంచే కార్యాచరణ మొదలు పెట్టాలని రేవంత్ రెడ్డి పని చేస్తున్నారు. ఆ రెండు పార్టీలకు చెక్ పెట్టడానికి అక్కడి నుంచే యుద్ధం ప్రారంభించాలని సిద్ధమవుతున్నారు.

ప్రస్తుతం తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో దీనికి సంబంధించిన చర్చలు గట్టిగానే నడుస్తున్నాయి. వచ్చే డిసెంబర్ నుంచి తన పొలిటికల్ స్కెచ్‌ని అమలు చేసే పనిలో ముఖ్యమంత్రి ఉన్నట్టు తెలుస్తోంది. అందుకు ఇప్పటినుంచి గ్రౌండ్ వర్క్ మొదలు పెట్టినట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌ని రెండోసారి అధికారంలోకి తీసుకొస్తానని ఇప్పటికే చేసిన ప్రకటనకు అనుగుణంగా పొలిటికల్ గ్రౌండ్ ప్రిపేర్ చేసుకునే పనిలో ఉన్నారన్నది పొలిటికల్ టాక్. డిసెంబర్ తర్వాత పూర్తిగా గ్రౌండ్‌లోనే ఉండాలని రేవంత్ డిసైడ్ అయినట్టు కనపడు తోంది. అందుకోసం ప్రధానంగా ఉత్తర తెలంగాణ మీద ఫోకస్ పెట్టబోతున్నారట. దక్షిణ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టుంది. గత ఎన్నికల్లో ఆ విషయం నిరూపితమైంది కూడా. కానీ, ఉత్తర తెలంగాణలో బీజేపీ బలపడుతున్నందున ఇక అక్కడ ఫోకస్ చేయాలన్నది సీఎం ప్లాన్‌గా తెలుస్తోంది. ఉత్తర తెలంగాణ నుండి తన రాజకీయ వ్యూహాన్ని అమలు చేసే పనిలో భాగంగా బస్సు యాత్ర లేదంటే పాదయాత్ర చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వ పథకాల అమలు, రాజకీయ ఎత్తుగడల్ని అక్కడి నుంచే అమలు చేయాలని భావిస్తున్నారని సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి బీఆర్ఎస్, బీజేపీల కట్టడిని అక్కడి నుంచే మొదలుపెట్టాలనుకుంటున్నట్లు అర్థం అవుతోంది. . ఓట్ బ్యాంకును పెంచుకోవడంతో పాటు,తన రెండున్నరేళ్ళ పాలన, గత బీఆర్ఎస్ పాలనపై చర్చకు పెట్టడంతో పాటు కేంద్రంలోని బీజేపీ తీరు, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కూడా ప్రజలు మాట్లాడుకునేలా చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు పాదయాత్ర నిర్వహించారు రేవంత్‌రెడ్డి. అది ఎలా ఉన్నా విపక్ష పార్టీలకు చెక్ పెట్టే లక్ష్యంతో ఏకంగా రెండు పార్టీలపై దాడిని ముమ్మరం చేశారు. దీంతో తెలంగాణలో రాజకీయం వేడెక్కింది. .




# డేటా ఆధారిత పాలనే భవిష్యత్

**అమరావతికి త్వరలో క్వాంటం కంప్యూటర్**


**డేటా, టెక్నాలజీ, పెట్టుబడులే ఆయుధాలు**

**స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలకు డేటా, సంజీవని, పీ4 కీలకం**

**వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి**

తిరుపతి, జూలై 02: సంతృప్తి చెందితే అభివృద్ధి అక్కడే ఆగిపోతుందని, అందుకే తాను త్వరగా సంతృప్తి చెందనని సీఎం చంద్రబాబు వెల్లడించారు. తిరుపతిలో నిర్వహించిన "స్వర్ణాంధ్ర-2047 ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ కెపాసిటీ బిల్డింగ్" రెండు రోజుల వర్క్‌షాప్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రసంగించారు. వర్క్‌షాప్‌లో భాగంగా సభికులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు, సాంకేతికత, డేటా ఆధారిత పాలన, పేదరిక నిర్మూలన, పెట్టుబడులు, భవిష్యత్ ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై తన ఆలోచనలను వివరించారు.

ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలను అన్వేషిస్తూ పనిచేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు, రాష్ట్రానికి అవసరమైన సొంత వ్యవస్థలను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అందరూ ఒకే లక్ష్యంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశం మనకు ఏమిచ్చిందనే దానికంటే, దేశానికి మనం ఏమి చేశామనే దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి వస్తుందని, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటర్ల తయారీ సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సాధించబోతోందని వెల్లడించారు. పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సీఎం, తాను స్వయంగా పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల జీవితాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాలు తీసుకొచ్చిన మార్పును ఉదాహరణగా వివరించారు. పేదల స్థితిగతులను మెరుగుపరచేందుకు జీఎస్డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక గణాంకాలను విశ్లేషిస్తూ పాలన సాగిస్తున్నామని చెప్పారు. తాను ఆర్థికశాస్త్రం చదివినా, సమాజం నుంచి, ప్రజల నుంచి ఇంకా ఎక్కువ నేర్చుకున్నానని చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశంలోనే తొలిసారిగా 2020 విజన్ డాక్యుమెంట్ రూపొందించినప్పుడు విమర్శలు ఎదుర్కొన్నానని గుర్తుచేసిన ఆయన, తర్వాత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి విజన్ డాక్యుమెంట్ అవసరమని భావించారని తెలిపారు.




ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిందని, సర్వీస్ సెక్టార్ విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని అప్పుడే విశ్వసించి ఆ దిశగా పనిచేశామని సీఎం చెప్పారు. ప్రస్తుతం డేటానే కొత్త సంపదగా మారిందని, భవిష్యత్తు పూర్తిగా డేటా ఆధారిత నిర్ణయాలదేనని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడంతో పాటు, రాష్ట్రంలో సంపద సృష్టికి ప్రైవేట్ రంగం నుంచి పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అందుకే స్వర్ణాంధ్ర విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులను కీలక అంశంగా చేర్చామని వెల్లడించారు. అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని కేవలం సేకరించడం మాత్రమే కాకుండా, వాటి మధ్య సమన్వయం కూడా అత్యంత కీలకమని పేర్కొన్నారు. డేటా లేక్ ద్వారా అన్ని శాఖల సమాచారాన్ని అనుసంధానం చేస్తున్నామని, ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ ద్వారా సంజీవని ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ సిద్ధం చేశామని తెలిపారు. పేద-ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, సమాజం నుంచి లబ్ధి పొంది ఎదిగిన వారు తిరిగి సమాజానికి కొంతైనా ఇవ్వాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ లక్ష్యమని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కూడా ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ కార్యదర్శి సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధాని ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ తదితరులు పాల్గొన్నారు.

# యూకే స్కాలర్‌షిప్‌లు... అంతర్జాతీయ విద్యకు కొత్త అవకాశాలు!

యూకేలో చదవాలనే కల ఉన్న ద
చాలా మంది విద్యార్థులు, తల్లిదండ్రులు
ఒకే విషయం గురించి ఎక్కువగా
ఆలోచిస్తుంటారు... లి"స్కాలర్‌షిప్ రావాలంటే
95% కంటే ఎక్కువ మార్కులు ఉండాలా?"లి
లేదా లి"అందరికీ స్కాలర్‌షిప్ దొరకదా?"లి
అనే సందేహాలు ఉంటాయి. కానీ వాస్తవానికి
యూకేలో స్కాలర్‌షిప్‌ల విషయంలో అనేక
అపోహలు ఉన్నాయి.

ప్రస్తుతం యూకేలోని అనేక విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాయి. ఇవి కేవలం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకే కాకుండా, మంచి అకడమిక్ రికార్డు, సరైన ప్రొఫైల్, ఎంపిక చేసిన కోర్సు ఆధారంగా కూడా లభించే అవకాశాలు ఉన్నాయి.

కొన్ని యూనివర్సిటీలు ఆటోమేటిక్ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తాయి. అంటే అడ్మిషన్‌కు దరఖాస్తు చేసిన తర్వాత విద్యార్థి అర్హతలను పరిశీలించి ప్రత్యేకంగా అప్లై చేయకుండానే ట్యూషన్ ఫీజులో తగ్గింపు ఇవ్వవచ్చు. మరికొన్ని యూనివర్సిటీల్లో స్కాలర్‌షిప్ కోసం ప్రత్యేక దరఖాస్తు అవసరం అవుతుంది.

స్కాలర్‌షిప్ మొత్తం కూడా ప్రతి యూనివర్సిటీకి భిన్నంగా ఉంటుంది. కొన్ని వేల పౌండ్ల నుంచి ట్యూషన్ ఫీజులో గణనీయమైన తగ్గింపు వరకు లభించే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల ప్రతి విద్యార్థి తన ప్రొఫైల్‌కు సరిపోయే యూనివర్సిటీలను ముందుగానే పరిశీలించడం చాలా ముఖ్యం.

చాలా మంది విద్యార్థులు ఆలస్యంగా దరఖాస్తు చేయడం వల్ల మంచి స్కాలర్‌షిప్ అవకాశాలను కోల్పోతుంటారు. ఎందుకంటే కొన్ని స్కాలర్‌షిప్‌లు పరిమిత సంఖ్యలో మాత్రమే అందుబాటులో ఉంటాయి. కాబట్టి సరైన సమయంలో అప్లికేషన్ పూర్తి చేయడం ద్వారా అవకాశాలు మరింత మెరుగవుతాయి.

స్కాలర్‌షిప్ పొందాలంటే కేవలం మార్కులే కాకుండా, మంచి Statement of Purpose (SOP), అవసరమైన పత్రాలు, ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ స్కోర్లు, సరైన కోర్సు ఎంపిక వంటి అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. సరైన మార్గదర్శకత్వంతో దరఖాస్తు చేస్తే స్కాలర్‌షిప్ పొందే అవకాశాలు పెరుగుతాయి.

యూకేలో ఉన్నత విద్య కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు స్కాలర్‌షిప్‌లపై పూర్తి సమాచారం తెలుసుకొని, తమ అర్హతకు సరిపోయే అవకాశాలను ముందుగానే పరిశీలించాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

యూకేలో ఉన్నత విద్యకు సంబంధించిన స్కాలర్‌షిప్ అవకాశాలు, సరైన యూనివర్సిటీ ఎంపిక, అడ్మిషన్ ప్రక్రియ, డాక్యుమెంటేషన్ మరియు స్టూడెంట్ వీసా మార్గదర్శకత్వం కోసం **EXXEELLA Educational Group** విద్యార్థులకు సమగ్ర సేవలను అందిస్తోంది.

మరిన్ని వివరాలకు
EXXEELLA Educational
Group ను సంప్రదించండి.



**మరిన్ని వివరాలకు**

**Akhila Gaddameedi**
Senior Adviser
Exxeella Education Group
9854422244
akhila@exxeella.com

# జర్నలిస్టుల హక్కుల సాధనకు జిల్లా మహాసభ..

- జర్నలిస్టుల సమస్యలే అజెండా
- ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులపై దృష్టి
- మహాసభ నిర్వహణకు కమిటీల ఏర్పాటు
- అనారోగ్య పాత్రికేయులకు ఆర్థిక సాయం
- సంగారెడ్డిలో భారీ ఏర్పాట్లు





**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో టియుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా మహాసభను ఈనెల 9న భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ వెల్లడించారు. మహాసభ ఏర్పాట్లపై సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అర్హులైన పలువురు జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇంకా అందకపోవడం, హెల్త్ కార్డుల సమస్య పెండింగ్‌లో ఉండటం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి అంశాలు చర్చకు రానున్నాయని వివరించారు. జిల్లాలో ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న, మధ్య తరహా పత్రికలు, ఉర్దూ పత్రికలు, కేబుల్ టీవీ, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు దశాబ్దాలుగా వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం యూనియన్ కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు, హెల్త్ కార్డులు, అక్రిడేషన్ కార్డుల సాధనకు కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు పాత్రికేయులకు పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. మహాసభ నిర్వహణ కోసం ఆహ్వాన, రిజిస్ట్రేషన్, ఆహార, వేదిక అలంకరణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామనారాయణతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నందున అన్ని మండలాలు, నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



## హరీశ్ రావు అరెస్టుపై చింత ప్రభాకర్ ఆగ్రహం

- ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా విమర్శ!
- గురుకుల టెండర్ల అంశంపై వివాదం
- అరెస్టుపై తీవ్ర అభ్యంతరం
- ప్రభుత్వ వైఖరిపై విమర్శలు
- పోరాటం కొనసాగిస్తామని స్పష్టం

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

గురుకుల టెండర్ల అంశంపై ఆధారాలు వెల్లడించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విమర్శించారు. గురుకుల టెండర్లలో జరిగిన అవకతవకల అంశాన్ని ప్రజల ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఈ చర్య చేపట్టడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం ఇవ్వాల్సింది పోయి పోలీసు వ్యవస్థను వినియోగించి అడ్డుకునే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గురుకుల టెండర్లలో అక్రమాలు జరగలేదని అధికార పక్ష నాయకులు ప్రకటిస్తూ బహిరంగ చర్చకు సవాళ్లు విసిరిన నేపథ్యంలో, వాటిని స్వీకరించి ఆధారాలతో ముందుకు వస్తున్న పరిస్థితిలో అరెస్టులు జరగడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. ఆధారాలపై ప్రజల సమక్షంలో చర్చకు రావాలని, ప్రశ్నించే హక్కును అణచివేసే చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. అరెస్టులు, నిర్బంధాలతో రాజకీయ పోరాటాలను అడ్డుకోలేరని, గురుకుల వ్యవస్థకు సంబంధించిన అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## చేనేత పోరు బరిలో నేతన్నల వారసులు..

- జోగిపేట ఎన్నికల్లో పెరిగిన ఆసక్తి
- నామినేషన్ల తొలి రోజు సందడి
- నేతన్న బిడ్డల జోరు
- సంక్షేమమే ప్రధాన ఎజెండా
- సంఘ ఎన్నికలపై పెరిగిన ఉత్కంఠ

**జోగిపేట చేనేత సహకార విక్రయ ఉత్పత్తి సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తొలి రోజే ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ నెల 10న జరగనున్న ఎన్నికల కోసం గురువారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి విజరాత్ అలీ వెల్లడించారు.**

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

తొలి రోజే చేనేత కార్మిక కుటుంబాల వారసులు బరిలోకి దిగడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత 35 సంవత్సరాలుగా చేనేత వృత్తిలో కొనసాగుతున్న మెట్టు మల్లమ్మ, వెంకటేశం దంపతుల కుమారుడు మెట్టు రమేష్, సంఘ మాజీ అధ్యక్షుడిగా సేవలందించిన కీర్తిశేషులు చిట్యాల పెంటయ్య కుమారుడు చిట్యాల మధు నామినేషన్లు దాఖలు చేశారు. కార్మిక కుటుంబాల నుంచి యువ నాయకత్వం ఎన్నికల రంగంలోకి రావడంతో సంఘ సభ్యుల్లో ఆసక్తి పెరిగింది. చేనేత కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, మగ్గం కష్టం తెలిసిన వారిగా కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సంఘాన్ని అభివృద్ధి, లాభాల దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అభ్యర్థులు పేర్కొన్నారు. పాత నాయకత్వ అనుభవం, కొత్త తరం ఆశయాల మధ్య ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారగా, నామినేషన్ల గడువు కొనసాగుతున్న నేపథ్యంలో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

## పోక్సో, అత్యాచార బాధితుల రక్షణకు శాఖల సమన్వయం కీలకం

- స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో కీలక చర్చలు
- బాధితులకు సమగ్ర సేవలపై దృష్టి
- రీ-విక్టిమైజేషన్ నివారణకు చర్యలు
- అవగాహన, పునరావాసానికి ప్రాధాన్యం



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

మహిళలు, చిన్నారులపై జరిగే పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితుల రక్షణ, సంక్షేమానికి అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డీజీపీ ఆదేశాల మేరకు జిల్లా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్టేక్‌హోల్డర్స్ కన్వర్జెన్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధితులకు వైద్య సేవలు, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పునరావాసం వంటి సేవలను ఒకే వేదికపై సమర్థవంతంగా అందించడంతో పాటు మానసికంగా మళ్లీ ఇబ్బందులు ఎదురుకాకుండా రీ-విక్టిమైజేషన్ నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భరోసా కేంద్రంలో వైద్యాధికారి నియామకం, వైద్య నివేదికల నాణ్యత పెంపు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సమావేశాల నిర్వహణ, విక్టిమ్ పరిహారం పెండింగ్ కేసుల పురోగతి, చదువు మధ్యలో నిలిచిపోయిన బాధిత బాలికలకు తిరిగి విద్యా అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. పోక్సో చట్టాలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖలు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తే బాధితులకు వేగవంతమైన న్యాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల ప్రతినిధులు తమ సేవలను వివరించి బాధితులకు నాణ్యమైన, త్వరిత గతిన సేవలు అందించేందుకు సూచనలు చేశారు.

## పరిశ్రమల స్థిరాభివృద్ధికి పటిష్ట నీటి నిర్వహణ అవసరం

- నీటి భద్రతపై ఉన్నత స్థాయి సదస్సు
- జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానానికి ప్రాధాన్యం
- సీఎస్ఆర్ నిధులతో చెరువుల పునరుద్ధరణకు పిలుపు
- స్మార్ట్ సాంకేతికత వినియోగంపై నిపుణుల సూచనలు




**హైదరాబాద్ ప్రతినిధి, జూలై 02:**

పరిశ్రమల విస్తరణతో పాటు పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో నిర్వహించిన "నీటి భద్రత – పారిశ్రామిక స్థిరత్వం" ఉన్నత స్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. నీటి భద్రత లేకుండా శాశ్వత పారిశ్రామిక వృద్ధి సాధ్యం కాదని పేర్కొంటూ, భవిష్యత్తులో ఏర్పాటు చేసే ప్రతి పారిశ్రామిక పార్కులో జీరో లిక్విడ్ డిశ్చార్జ్ విధానం, అధునాతన మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను తప్పనిసరి చేస్తామని వెల్లడించారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యత నిధులను స్థానిక చెరువుల పునరుద్ధరణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాల మెరుగుదలకు వినియోగించాలని పిలుపునిచ్చారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గుతున్న పరిస్థితుల్లో పరిశ్రమలు ఐఓటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలను వినియోగించి నీటి వృథా, లీకేజీలను నివారించాలని సదస్సులో పాల్గొన్న నిపుణులు సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 100 మందికి పైగా పారిశ్రామిక ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, ఉన్నతాధికారులు పాల్గొని నీటి నిర్వహణ, పారిశ్రామిక స్థిరాభివృద్ధిపై విస్తృతంగా చర్చించారు.



## సికింద్రాబాద్‌లో గోల్డెన్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభం

**సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి మరో అడుగు**

**వసతి సౌకర్యాలను వర్చువల్‌గా ప్రారంభించిన దక్షిణ భారత్ ఏరియా జీఓసీ**

**సికింద్రాబాద్, జూలై 2**

సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్ పరిధిలో నూతనంగా నిర్మించిన 'గోల్డెన్ పామ్ కాంప్లెక్స్'ను దక్షిణ భారత్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జీఓసీ) గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ-ఆంధ్ర సబ్ ఏరియా ప్రధాన కార్యాలయ జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌తో పాటు సికింద్రాబాద్ మిలిటరీ స్టేషన్‌కు చెందిన సేవలో ఉన్న సైనికులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ నగరంలోని ప్రధాన ప్రాంతంలో, జూబ్లీ బస్ స్టేషన్, రెండు మెట్రో స్టేషన్లకు సమీపంలో ఈ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. దీంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సైనికులు, వారి కుటుంబ సభ్యులకు రాకపోకలు మరింత సులభంగా ఉండనున్నాయి. ఈ కాంప్లెక్స్‌లో త్రివిధ దళాలు, భారత తీర రక్షక దళానికి చెందిన సేవలో ఉన్న సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక బస కోసం అందుబాటు ధరల్లో ఆధునిక వసతి సౌకర్యాలు కల్పించారు. ఒకరికి, ఇద్దరికి అనువైన గదులను ఏర్పాటు చేసి సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించారు. దక్షిణ భారత్ ఏరియా ప్రధాన కార్యాలయం ఆధ్వర్యంలో బెంగళూరు, చెన్నై నగరాల్లో ఇప్పటికే ఇలాంటి గోల్డెన్ పామ్ వసతి సముదాయాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో చెన్నైలోని గోల్డెన్ పామ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాల సంక్షేమానికి భారత సైన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు పేర్కొన్నారు. ఇటువంటి వసతి కేంద్రాల ఏర్పాటు ద్వారా సైనిక కుటుంబాలకు మరింత భద్రత, సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. గోల్డెన్ పామ్ కాంప్లెక్స్ ప్రారంభంతో సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వసతి సౌకర్యాలు మరింత అందుబాటులోకి వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. సైన్యం తన విస్తృత కుటుంబం పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ కేంద్రం మరో నిదర్శనంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## గురుకులాల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయ నియామకాలు

- అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- 12 విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీ
- జూలై 7 వరకు దరఖాస్తుల గడువు
- డెమో తరగతుల ద్వారా ఎంపిక
- పోస్టుల వారీగా గౌరవ వేతనాలు

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 02**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంగారెడ్డి జిల్లా పరిధిలోని 12 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా సమన్వయ అధికారి జి. కల్పన వెల్లడించారు. చిట్కుల్, ఇస్నాపూర్, ఆందోల్, రంజోల్, రాయికోడ్ బాలికల గురుకుల పాఠశాలలు, అంబేద్కర్ కళాశాల, హత్నూర, కొండాపూర్, నారాయణఖేడ్, నల్లవాగు, సింగూర్, న్యాల్కల్ బాలుర గురుకుల పాఠశాలల్లో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, స్పెషల్ టీచర్ పోస్టులకు సంబంధిత నిబంధనల ప్రకారం విద్యార్హతలు కలిగి ఉండాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 7 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని, జూలై 8 ఉదయం 10 గంటలకు చిట్కుల్‌లోని జిల్లా సమన్వయ అధికారి కార్యాలయంలో డెమో తరగతుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, అనుభవ పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. నెలవారీ గౌరవ వేతనంగా జూనియర్ లెక్చరర్‌కు రూ.23,400, పీజీటీ, టీజీటీలకు రూ.18,200, స్పెషల్ టీచర్లకు రూ.14,200 చెల్లించనున్నట్లు వెల్లడించారు. నియామకాల విషయంలో సంస్థ నిర్ణయమే తుది నిర్ణయమని, అవసరమైతే నియామక ప్రక్రియలో మార్పులు చేసే అధికారం సంస్థకు ఉంటుందని స్పష్టం చేశారు.



## వ్యవసాయ భూమి నుంచి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని రిటైర్డ్ పోస్టుమాస్టర్ మృతి

**సూర్యాపేట, జూలై 2**

సూర్యాపేట జిల్లా సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్ మండలం చీదేళ్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ పోస్టుమాస్టర్ కన్మంతరెడ్డి కృపాకర్ రెడ్డి (70) దుర్మరణం పాలయ్యారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కృపాకర్ రెడ్డి వ్యవసాయ భూమి నుంచి సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా, సాయంత్రం సుమారు 4.50 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వెన్న గోపిరెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ రాంబాబు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృపాకర్ రెడ్డి కిందపడగా, ట్రాక్టర్ చక్రం ఆయన తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## నూతన కోర్టు భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: సీనియర్ సివిల్ జడ్జి కే. సురేష్

**కోదాడ, జూలై 2**

కోదాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నూతన నాలుగు కోర్టుల సముదాయం (కోర్టు కాంప్లెక్స్) భవన నిర్మాణ పనులను సీనియర్ సివిల్ జడ్జి కే. సురేష్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, కోర్టు హాళ్లు, న్యాయమూర్తుల చాంబర్లు, కార్యాలయ గదులు, ఇతర మౌలిక సదుపాయాల ఏర్పాటును ఆయన పరిశీలించి, పనుల నాణ్యతపై గుత్తేదారుకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, దేవబత్తిని నాగార్జున, ఉపాధ్యక్షుడు గట్ల నరసింహారావు, కార్యదర్శి రామకృష్ణ, రంజాన్ పాషా, రంగారావు, పెద్దబ్బాయి, కె.వి. రావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వేగవంతం చేయాలి: డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, జూలై 2**

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. గత ఏడాది డిసెంబరులో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. గురువారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ల పునర్వ్యవస్థీకరణ వల్ల ప్రజాకేంద్రిత, సమర్థవంతమైన పోలీసింగ్‌కు మరింత బలం చేకూరడంతో పాటు ప్రజలకు అందే పోలీసు సేవల నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ పరిమితులు, రెవెన్యూ డివిజన్లు, కోర్టుల అధికార పరిధులను పరిగణనలోకి తీసుకుని పోలీస్ స్టేషన్ల సరిహద్దులను పునర్నిర్వచించాలని కమిషనర్లకు ఆదేశించారు. భవిష్యత్‌లో నగర విస్తరణ, జనాభా పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అలాగే ప్రజలు, ప్రభుత్వ శాఖలు, న్యాయవ్యవస్థకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపి పరిధి వివాదాలను పరిష్కరించాలని డీజీపీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి, సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి, మల్కాజిగిరి కమిషనర్ సుమతి, సంయుక్త పోలీస్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### బీసీ జేఏసీ పిలుపుతో మిర్యాలగూడలో కళాశాలల బంద్ విజయవంతం

**మిర్యాలగూడ, జూలై 2**



రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన కళాశాలల బంద్ విజయవంతమైందని బీసీ జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలోకి రాకముందు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని, పూర్తి ఫీజు చెల్లిస్తేనే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇస్తామని కళాశాల యాజమాన్యాలు చెబుతున్నాయని అన్నారు. దీంతో విద్యార్థుల ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గతంలో అమలులో ఉన్న విధంగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగించాలని, 10 వేల ర్యాంకు నిబంధనను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక, బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి బంటు కవిత, బీసీ యువజన సంఘం పట్టణ నాయకులు ఎస్.పీ. నాయుడు, బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి నక్క నాగరాజు ముదిరాజ్, ఎస్సీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు చిత్రం ఉమా, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉబ్బపల్లి శంకర్, సిరి గణేష్, శాంతికుమార్‌తో పాటు శ్రీజ, శ్రీవల్లి, గాయత్రీ, సహస్ర, మానస, శ్రీవాణి, సిరి, సాయికుమార్, గౌతమ్, అశోక్ కుమార్, వెన్నెల, పావని, కరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ తోటలతో రైతులకు సిరుల పంట

### వరిని వీడి పామాయిల్ సాగు వైపు మళ్లాలి: కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

**సూర్యాపేట, జూలై 2**



రైతులు సంప్రదాయ వరి సాగుకు బదులుగా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం అందించే పామాయిల్ సాగు వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేట మండలం కాసరాబాద్ గ్రామంలో పామాయిల్ తోటలను గురువారం పరిశీలించిన ఆయన, పామాయిల్ సాగు చేస్తున్న రైతు ఆశబోయిన మల్లేష్‌తో మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పామాయిల్ రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభసాటి పంటగా మారుతోందన్నారు. వరి సాగుతో పోలిస్తే పెట్టుబడి భారం తక్కువగా ఉండటంతో పాటు, ఒకసారి తోటను ఏర్పాటు చేస్తే నాలుగో సంవత్సరం నుంచి సుమారు 30--35 సంవత్సరాల పాటు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 70 నుంచి 90 శాతం వరకు సబ్సిడీ అందిస్తున్నాయని పేర్కొన్నారు. అదనంగా తోట నాటిన తొలి నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి రూ.4,200 చొప్పున పెట్టుబడి సహాయం కూడా ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పామాయిల్ మొక్కలు పూర్తిగా ఎదిగే తొలి మూడు సంవత్సరాల వరకు కోకో, వక్క, మిరియాలు, తమలపాకు వంటి అంతర పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. మూడున్నర నుంచి నాలుగు సంవత్సరాల తర్వాత పామాయిల్ దిగుబడి ప్రారంభమై రైతులకు ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి తీగల నాగయ్య, వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్తయ్య, సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి కట్ట స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారులు యారాల సుధాకర్ రెడ్డి, రంగు ముత్యం రాజు, వంగూరి అనిల్, ఆయిల్ ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ నిమ్మ గోపికృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్ భవిష్యతో పాటు రైతులు వెదిరే లక్ష్మీనరసింహారెడ్డి, కిషన్ రెడ్డి, ఆశబోయిన మల్లేష్, బొమ్మగాని సైదులు, రామకృష్ణ, తన్నీరు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే యువతకు ఉజ్వల భవిష్యత్

### కెఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సు

**కోదాడ, జూలై 2**




సమాజాన్ని మాదకద్రవ్యాల మహమ్మారి నుంచి కాపాడాలంటే యువతే ముందుండాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని నిర్మించుకోవాలని కోదాడ పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ బి. సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. కె.ఆర్.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం, కోదాడ పోలీసు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం "మాదకద్రవ్యాల నివారణ"పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగు లెక్చరర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వేముల వెంకటేశ్వర్లు స్వాగతం పలకగా, కళాశాల ప్రిన్సిపాల్ నారు రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ఎస్ఐ బి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా మానసిక, ఆర్థిక, సామాజిక జీవితాలను కూడా నాశనం చేస్తుందని హెచ్చరించారు. చిన్న వయస్సులోనే డ్రగ్స్‌కు అలవాటు పడితే వ్యసనపరులుగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ విక్రయించినా, కొనుగోలు చేసినా, వినియోగించినా చట్టపరంగా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుని జైలు శిక్ష విధిస్తారని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి యువకుడు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. సదస్సు అనంతరం విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించి, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు డ్రగ్ కమిటీ సభ్యుడు హుస్సేన్ గౌడ్, కళాశాల డ్రగ్స్ కమిటీ సభ్యులు జి. నాగరాజు, ఆర్. పిచ్చిరెడ్డి, జి.యాదగిరి, వి.బాలభీమారావు, ఆర్. రమేష్, ఎం.రత్నకుమారి, బి.రమేష్, జి.వెంకన్న, కె. రామరాజు, జి. రవికిరణ్, కె. సతీష్, పి. తిరుమల, గోపీకృష్ణ, ఇ.నరసింహారెడ్డి, ఎస్.కె. ముస్తఫా, తిరుపతయ్య, ఎస్.కె.ఆరిఫ్, కె. శాంతయ్య, ఎన్. జ్యోతిలక్ష్మి, ఆర్.చంద్రశేఖర్, ఎస్. వెంకటేశ్వరచారి, టి. మమత, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్యుల సేవలు దైవసమానం: అదనపు డీసీపీ పి.వెంకటరమణ







### శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, సీఏ డే, పోస్టల్ వర్కర్స్ డే, సేవా కార్యక్రమాలు

**కరీంనగర్, జూలై 1**

ప్రజారోగ్య పరిరక్షణలో నిబద్ధతతో సేవలందిస్తూ అనేక మంది ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు దైవ స్వరూపులని కరీంనగర్ జిల్లా అదనపు డీసీపీ పి. వెంకటరమణ అన్నారు. జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ల సన్మాన కార్యక్రమం, ఉచిత నోటి-గొంతు క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాత్రింబవళ్లు రోగుల ప్రాణాలను కాపాడేందుకు శ్రమిస్తున్న వైద్యులు తమ వ్యక్తిగత, కుటుంబ జీవితాలకు కూడా సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణ బాధ్యతను కూడా సమాజం పంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గౌరవ అతిథి లయన్ డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ, వైద్యులు ప్రజల కళ్లముందే కనిపించే ప్రాణదాతలని, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించాలన్నారు. కార్యక్రమ చైర్మన్ లయన్ డాక్టర్ సీహెచ్ రమణాచారి మాట్లాడుతూ, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే వ్యాధులు రాకుండా ప్రజల్లో అవగాహన కల్పించడమే ముఖ్యమన్నారు. పొగాకు, గుట్కా, మద్యం వంటి దురలవాట్ల వల్ల నోటి, గొంతు క్యాన్సర్లు అధికంగా వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ స్పెషాలిటీ వైద్యులను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజలకు ఉచిత నోటి, గొంతు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మర్రిపల్లి మహేందర్, కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, కోశాధికారి ఎం. ప్రవీణ్, లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఈ. రమేష్, వి. జగదీశ్వరాచారి, డాక్టర్ వి. శ్రీనివాస్, ఎం. వేణు, ఎం. అరవింద్ బాబు, సురేందర్, రఘునందన్ రావు, కిరణ్, ఆసుపత్రి సిబ్బంది, పలువురు ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

**చార్టర్డ్ అకౌంటెంట్లకు ఘన సత్కారం**

జాతీయ చార్టర్డ్ అకౌంటెంట్స్ డే సందర్భంగా ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్లు సీఏ డి. నిరంజనాచారి, సీఏ ఎం. ప్రవీణ్ కుమార్ తదితరులను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఏ డి. నిరంజనాచారి మాట్లాడు తూ, వ్యక్తులు, సంస్థల ఆర్థిక వ్యవస్థను సక్రమంగా నడిపించడంలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని, వారికి సమాజంలో తగిన గౌరవం, గుర్తింపు కల్పించాలని కోరారు.

**వృద్ధాశ్రమానికి చీరలు, బెడ్‌షీట్లు పంపిణీ**

వెదురు గ్రామ సమీపంలోని స్పందన వృద్ధాశ్రమంలో లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి చొరవతో చీరలు, బెడ్‌షీట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు.

**పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా పోస్టుమెన్ల సన్మానం**

జాతీయ పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా ఇద్దరు పోస్టుమెన్లను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పోస్టల్ సిబ్బంది సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

# ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులకూ అల్పాహారం- భోజనం

**రాష్ట్ర మంత్రిమండలి కీలక నిర్ణయం..**

**టిమ్స్‌లో 6,278 పోస్టులు..**

**మూసీ ఫేజ్-1కు రూ.7,345 కోట్లు..**

**వీబీజీ రామ్‌జీ పథకంపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయం**



హైదరాబాద్, జూలై 2

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే చారిత్రాత్మక నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెంపు, పోషకాహార లోపం నివారణ, ఉపాధ్యాయులు--సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దేశంలోనే వినూత్న సంక్షేమ కార్యక్రమంగా ఇది నిలుస్తుందని ప్రభుత్వం అభిప్రాయపడింది.

**వీబీజీ రామ్‌జీ పథకంపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్న రాష్ట్రం**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీజీ రామ్‌జీ పథకంపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించింది. ఈ అంశాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో నియమించిన మంత్రివర్గ ఉపసంఘం నివేదికను సమావేశంలో పరిశీలించారు. ఈ పథకాన్ని రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం యథాతథంగా అమలు చేయాలని నిర్ణయించిందని, రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని మంత్రులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పథకంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అయితే, ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి నష్టం కలగకుండా ఉండేందుకు గత్యంతరంలేని పరిస్థితుల్లో రాష్ట్రంలో కూడా ఆ పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని మంత్రివర్గం భావించినట్లు తెలిపారు.

**టిమ్స్ ఆసుపత్రుల్లో భారీ నియామకాలు**

రాష్ట్రంలో కొత్తగా అందుబాటులోకి వస్తున్న సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు 6,278 పోస్టులను మంత్రివర్గం మంజూరు చేసింది. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అత్యాధునిక వైద్య సేవలు అందించే కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. అలాగే ఇక్కడ చికిత్స పొందే పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా ఎల్ఓసీలు జారీ చేసే విధానానికీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**మూసీ రివర్‌ఫ్రంట్‌కు రూ.7,345 కోట్లు**

హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలకమైన మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కూడా మంత్రివర్గం భారీ ఆమోదం తెలిపింది. ఫేజ్--1లో భాగంగా గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ దశ పనుల కోసం రూ.7,345 కోట్ల వ్యయానికి ఆమోదం తెలుపుతూ, త్వరలోనే టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ నది పునరుజ్జీవనం, వరద నియంత్రణ, పర్యావరణ పరిరక్షణతో పాటు నగర సుందరీకరణకు ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రజా సంక్షేమం--ఉపాధి--ఆరోగ్యానికి ప్రాధాన్యం**

మొత్తంగా రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు విద్య, ఆరోగ్యం, గ్రామీణ ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా ఉన్నాయని మంత్రులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార పథకం విస్తరణ, టిమ్స్ ఆసుపత్రుల్లో భారీ నియామకాలు, మూసీ అభివృద్ధి, ఉపాధి హామీ అంశంపై న్యాయపోరాటం వంటి నిర్ణయాలు రాష్ట్ర ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుస్తాయని పేర్కొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి డీఈవో సహకారం: చర్యలు తీసుకోవాలి

**ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం**

సూర్యాపేట, జూలై 2

జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) అశోక్‌పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, జనసేవా సమితి అధ్యక్షుడు తగుళ్ల జనార్ధన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి పిడమర్తి భరత్ మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల ఆదేశాలను ధిక్కరిస్తూ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, బెల్టులు, టైలు, షూలు, బ్యాగులు తదితర వస్తువులను పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులను బలవంతపెట్టి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా, అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తూ "ఐఐటీ", "ఒలింపియాడ్", "టెక్నో", "ఈ-టెక్నో" వంటి ఆకర్షణీయ పేర్లతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో అనుమతులు లేకుండానే అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు, వసతిగృహాలు నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పలుమార్లు ఈ అంశాలను డీఈవో దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు డీఈవో సహకరిస్తున్నారనే చర్చ జిల్లావ్యాప్తంగా జరుగుతోందని ఆరోపించారు. డీఈవో అక్రమాలపై పలు సందర్భాల్లో మీడియాలో కథనాలు వచ్చినప్పటికీ ఆయన వైఖరిలో మార్పు రాలేదని, పాఠశాలలను తనిఖీ చేయకుండా బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డీఈవోపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు.



# 'మిషన్ తెలంగాణ'కు శ్రీకారం చుట్టిన బీజేపీ.. 2028 ఎన్నికలే లక్ష్యం

హైదరాబాద్, జూలై 2

2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారికంగా 'మిషన్ తెలంగాణ' ప్రచారాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) బలహీనపడుతున్నాయని పేర్కొంటూ బీజేపీ తన రాజకీయ వ్యూహానికి శ్రీకారం చుట్టింది. గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ బీజేపీ అధికార ప్రతినిధి పి.ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ఇటీవల హైదరాబాద్ పర్యటన 'మిషన్ తెలంగాణ'కు నాంది పలికిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీని ప్రధాన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలను 2028 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తొలి కీలక రాజకీయ పరీక్షగా భావిస్తున్న బీజేపీ, బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, సంస్థాగత పునర్వ్యవస్థీకరణ, ప్రజల్లో విస్తృతంగా చేరుకునే కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించింది. రెండేళ్లకు పైగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయడంలో విఫలమైందని, మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణపై భారీ అప్పుల భారం మోపిందని బీజేపీ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో పార్టీ సంస్థాగతంగా సాధించిన విస్తరణను ప్రస్తావించిన పి.ఎల్. శ్రీనివాస్, అదే తరహా కేడర్ నిర్మాణం, ఓటర్లలో విస్తృత ప్రచారం ద్వారా తెలంగాణలో కూడా బీజేపీ బలపడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 'మిషన్ తెలంగాణ' ప్రకటనతో 2028 అసెంబ్లీ ఎన్నికల రాజకీయ పోరుకు బీజేపీ ముందస్తుగా సిద్ధమవుతోందని, అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా ఎదగడమే పార్టీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నితిన్ నవీన్ హైదరాబాద్ పర్యటన కేవలం సంస్థాగత కార్యక్రమం మాత్రమే కాదని, పార్టీ శ్రేణులకు, ప్రజలకు, అలాగే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు స్పష్టమైన రాజకీయ సందేశమని ఆయన వ్యాఖ్యానించారు.

# జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలి

**కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్, జూలై 2

కరీంనగర్ నగర పురవీధుల్లో జూలై 16న నిర్వహించనున్న ఐదవ జగన్నాథ రథయాత్రను భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జగన్నాథ రథయాత్ర నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి రథయాత్ర కరపత్రాలను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూరీలో జరిగే జగన్నాథ రథయాత్ర పుణ్య గడియల్లోనే కరీంనగర్‌లో కూడా రథోత్సవం నిర్వహించడం భక్తులకు అరుదైన అదృష్టమని అన్నారు. జగన్నాథుడి రథాన్ని లాగే అవకాశం ప్రతి భక్తుడికి పుణ్యఫలాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. జూలై 16న మధ్యాహ్నం 12 గంటలకు మహాశక్తి దేవాలయం నుంచి రథయాత్ర ప్రారంభమై సెయింట్ జాన్స్ స్కూల్, మంకమ్మతోట లేబర్ అడ్డా, మంకమ్మతోట, తెలంగాణ చౌక్, బస్ స్టాండ్, టవర్ సర్కిల్ మీదుగా వైశ్య భవన్ వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం ప్రవచనాలు, ప్రత్యేక పూజలు, ప్రసాద వితరణతో రథయాత్ర ముగుస్తుందని వివరించారు. రథయాత్రలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ కమిషనరేట్ తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రథయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ రథయాత్ర నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కన్న కృష్ణ, డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ భూ బదలాయింపు యత్నాన్ని అడ్డుకోవాలి

**ఆర్డీవోకు బాధితురాలి వినతి**

సూర్యాపేట టౌన్, జూలై 2

సూర్యాపేట జిల్లా మోతె గ్రామంలోని సర్వే నంబర్ 237లో ఉన్న తమ పూర్వీకుల భూమిని అక్రమ పత్రాల ఆధారంగా బదలాయింపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, పూర్తి స్థాయి విచారణ జరిపి మ్యుటేషన్ ప్రక్రియను నిలిపివేయాలని బాధితురాలు పడాల అఖిల సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన 7 ఎకరాల 16 గుంటల భూమిలో 2019లో జాతీయ రహదారి ఎన్‌హెచ్--365బీబీ నిర్మాణం కోసం 36 గుంటలు ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తెలిపారు. మిగిలిన భూమిలోని రెండు ఎకరాలను ఖమ్మం జిల్లా వాస్తవ్యుడు బోడపట్ల రాజేంద్రప్రసాద్ కొందరు మోతె తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సహకారంతో అక్రమంగా తన పేరుపైకి మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ భూమికి సంబంధించిన వివాదంపై ఇప్పటికే సూర్యాపేట కోర్టులో కేసు దాఖలు చేసి, అది విచారణలో ఉండగానే తన అనుమతి లేకుండా మరోసారి భూ బదలాయింపునకు ప్రయత్నించడం చట్టవిరుద్ధమని ఆమె పేర్కొన్నారు. జాతీయ రహదారి కోసం కోల్పోయిన 36 గుంటల భూమికి ప్రభుత్వం చెల్లించిన నష్టపరిహారం కూడా రాజేంద్రప్రసాద్ తన ఖాతాలోకి మళ్లించుకున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నించగా తనతో పాటు కుటుంబ సభ్యులపై భౌతిక దాడులకు పాల్పడటమే కాకుండా బెదిరింపులకు కూడా దిగుతున్నారని వాపోయారు. సదరు భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్, రెవెన్యూ రికార్డులు సహా అన్ని చట్టబద్ధమైన హక్కు పత్రాలు తన పేరుపైనే ఉన్నాయని పేర్కొన్న అఖిల, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి అక్రమ భూ బదలాయింపును నిలిపివేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆర్డీవోను కోరారు. ఈ కార్యక్రమంలో పగడాల నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత ఫైటో-మందులతో సోరియాసిస్, మధుమేహ గాయాల చికిత్సకు హైదరాబాద్ స్టార్టప్ ముందడుగు

హైదరాబాద్, జూలై 2

హైదరాబాద్‌కు చెందిన బయోటెక్నాలజీ స్టార్టప్ అక్యూబయోసిస్ ప్రైవేట్ లిమిటెడ్ కృత్రిమ మేధస్సు (AI), నానో టెక్నాలజీ ఆధారంగా సోరియాసిస్, మధుమేహ రోగుల దీర్ఘకాలిక గాయాల చికిత్స కోసం ఫైటో-మెడిసిన్లను అభివృద్ధి చేసింది. ఈ సంస్థకు బీఆర్ఐసీ-సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (BRIC-CDFD)లోని టెక్నాలజీ ఇంక్యుబేటర్ మద్దతు అందించింది. సంస్థ ఇప్పటికే రెండు పేటెంట్ పొందిన ఉత్పత్తులను వాణిజ్యపరంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. 'బోకుగ్ల్ (BOCUGL)' అనే చర్మంపై రాసే ఔషధం సోరియాసిస్, అటోపిక్ డెర్మటైటిస్, మెలాస్మా వంటి చర్మవ్యాధుల చికిత్సకు ఉపయోగపడుతుంది. అలాగే 'అజ్‌బెకో (AZBECO)' అనే అధునాతన గాయాల సంరక్షణ ఔషధం మధుమేహ పాద గాయాలు, దీర్ఘకాలిక గాయాల చికిత్సకు వినియోగిస్తున్నారు. ఈ రెండు ఉత్పత్తులు భారతదేశంలో ఆయుష్ ప్రమాణాలు, గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్ (GMP) నిబంధనలకు అనుగుణంగా తయారవుతున్నాయి. సంస్థ భారత్, చైనా, అమెరికాలో పేటెంట్ దరఖాస్తులు దాఖలు చేసింది. ఆటోఇమ్యూన్, అంటువ్యాధుల చికిత్స కోసం తదుపరి తరం ఫైటో-ఫార్మాస్యూటికల్స్ అభివృద్ధి దిశగా తమ~~×~~ ఆధారిత ఔషధ పరిశోధన వేదికను విస్తరిస్తోంది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ మద్ది మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు, నానో టెక్నాలజీ, జీవశాస్త్రాన్ని సమన్వయం చేసి తక్కువ ధరలో శాస్త్రీయ ఆధారాలతో కూడిన చికిత్సలను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, భారత బయోటెక్నాలజీ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఆరు నెలల్లో స్వాధీనం వాహనాలు తీసుకెళ్లాలి

**లేకపోతే వేలం లేదా పాతసామానుగా విక్రయం: ఎస్పీ నరసింహ**

సూర్యాపేట, జూలై 2

వివిధ నేరాల విచారణలు, వాహనాల తనిఖీల సమయంలో పోలీసులు స్వాధీనం చేసుకుని జిల్లా పోలీసు ఆధీనంలో ఉంచిన ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు ఆరు నెలల గడువులోగా సరైన పత్రాలు సమర్పించి విడిపించుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు. జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో ప్రస్తుతం సుమారు 20 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని తెలిపారు. వీటికి సంబంధించిన యాజమాన్యాన్ని నిరూపించే రిజిస్ట్రేషన్, బీమా, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. నిర్దేశించిన ఆరు నెలల గడువులోగా ఎవరూ ముందుకు రాకపోతే, వినియోగానికి పనికిరాని వాహనాలను పాతసామానుగా విక్రయించడంతో పాటు, వినియోగ యోగ్యమైన వాహనాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తామని ఎస్పీ హెచ్చరించారు. స్వాధీనంలో ఉన్న వాహనాల పూర్తి వివరాలను జిల్లా పోలీసు అధికారిక ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విటర్) సామాజిక మాధ్యమ ఖాతాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని గడువులోగా తమ వాహనాలను విడిపించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## వర్షంలో తడుస్తూ సందడి చేసిన

# తమన్నా భాటియా ..

మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షించారు. ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలను ఆస్వాదిస్తూ ఇంటి బాల్కనీలో గడిపిన అందమైన క్షణాలను వీడియో రూపంలో పంచుకోగా, అది నెట్టింట వైరల్‌గా మారింది. వర్షపు చినుకుల్లో తడుస్తూ చిన్నపిల్లలా సందడి చేసిన తమన్నా, చల్లని గాలిని ఆస్వాదిస్తూ చిరునవ్వుతో కనిపించారు. వర్షంలో పూర్తిగా తడిసిపోయినా ఆ ఆనందాన్ని సహజంగా ఆస్వాదించిన తీరు అభిమానులను ఆకట్టుకుంది. ప్రకృతితో మమేకమైన ఆ క్షణాలను ఆమె కెమెరాలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ వీడియోకు ఇప్పటికే లక్షలాది వ్యూస్ రావడంతో పాటు వేల సంఖ్యలో లైకులు, కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. “రెయిన్ క్వీన్”, “వర్షంలో తమన్నా మరింత అందంగా కనిపిస్తున్నారు”, “సహజమైన క్షణాలు ఎంతో బాగున్నాయి” అంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే, తమన్నా ప్రస్తుతం బాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో వరుస చిత్రాలు, ఓటీటీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. నటిగా మాత్రమే కాకుండా ప్రత్యేక పాత్రలు, డ్యాన్స్ నంబర్లతోనూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. షూటింగ్‌ల మధ్య దొరికే విరామ సమయంలో తన ప్రయాణాలు, ఫిట్‌నెస్, ఫ్యాషన్, వ్యక్తిగత అనుభవాలకు సంబంధించిన పోస్టులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో చురుకుగా కొనసాగుతున్నారు.

## ఈవ్‌టీజింగ్‌పై కాయదు లోహర్ సంచలన వ్యాఖ్యలు



దక్షిణాది సినీ పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న యువ నటి కాయదు లోహర్ తన చిన్ననాటి చేదు అనుభవాన్ని పంచుకున్నారు. పదో తరగతి చదువుతున్న సమయంలో ఈవ్‌టీజింగ్‌కు గురయ్యానని, ఆ వేధింపులను తట్టుకోలేక ఓ యువకుడిపై రాయి విసిరానని వెల్లడించారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కాయదు, ట్యూషన్‌కు వెళ్లే సమయంలో కొందరు యువకులు తరచూ వేధించేవారని తెలిపారు. మొదటి రెండు రోజులు మౌనంగా భరించినా, మూడో రోజు ఓ యువకుడు హద్దులు దాటడంతో తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు చెప్పారు. ఆ సమయంలో రోడ్డుపక్కన ఉన్న పెద్ద రాయిని తీసుకుని అతడి వైపు విసరగా, అది తలకు తగిలి గాయమైందని వివరించారు. ఆ సంఘటన తన జీవితంలో మరచిపోలేని అనుభవమని చెప్పారు. తాను బయటకు చాలా సాఫ్ట్‌గా కనిపించినప్పటికీ, ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే గట్టిగా ఎదురు నిలబడతానని కాయదు పేర్కొన్నారు. అవసరమైతే మరోసారి కూడా అలాంటి వారిని ఎదిరిస్తానని స్పష్టం చేశారు. కాయదు లోహర్ ప్రస్తుతం తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. నాని కథానాయకుడిగా తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్’తో పాటు పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో ఆమె నటిస్తున్నారు.



## ‘జైలర్ 2’ అప్‌డేట్‌కు


# రంగం సిద్ధం..

### సాయంత్రం భారీ ప్రకటన

సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘జైలర్ 2’ చిత్రం నుంచి ఈరోజు సాయంత్రం కీలక అప్‌డేట్ రానుంది. చిత్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక ప్రకటన విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ‘ది టైగర్ మళ్లీ వేటకు సిద్ధమయ్యాడు’ అంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. దీంతో ఈ అప్‌డేట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం 2023లో ఘన విజయం సాధించిన ‘జైలర్’కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ప్రస్తుతం చిత్ర నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఈరోజు విడుదలయ్యే అప్‌డేట్ గ్లింప్స్, కొత్త పోస్టర్ లేదా విడుదల తేదీ ప్రకటనకు సంబంధించినదై ఉండొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# దుల్కర్ సల్మాన్‌ను విచారించిన కస్టమ్స్..

## ఎస్‌యూవీ స్మగ్లింగ్ కేసులో దర్యాప్తు ముమ్మరం



లగ్జరీ ఎస్‌యూవీ కార్ల అక్రమ రవాణా కేసులో సినీ నటుడు దుల్కర్ సల్మాన్‌ను కస్టమ్స్ అధికారులు విచారించారు. ‘ఆపరేషన్ నుమ్‌ఖోర్’లో భాగంగా కొచ్చిలోని కస్టమ్స్ కార్యాలయానికి హాజరైన ఆయనను అధికారులు సుమారు నాలుగు గంటల పాటు ప్రశ్నించారు. దర్యాప్తులో భాగంగా దుల్కర్ సల్మాన్‌కు చెందిన నాలుగు లగ్జరీ వాహనాలను అధికారులు గతంలోనే స్వాధీనం చేసుకున్నారు. వాటిలో రెండింటిని ఆయన తాత్కాలికంగా విడిపించుకోగా, మిగిలిన రెండు వాహనాల కోసం ఇప్పటివరకు ఎలాంటి దరఖాస్తు చేయలేదని సమాచారం. ఆయన వద్ద ఉన్న ఇతర ఖరీదైన వాహనాల వివరాలను కూడా అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో దుల్కర్‌తో పాటు అక్రమ వాహనాల వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న మరో నలుగురిని కూడా కస్టమ్స్ అధికారులు విచారించారు.

## ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టు షాక్..

### 134 సినిమాల పాటల ప్రసారంపై తాత్కాలిక నిషేధం



ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ప్రముఖ సంగీత సంస్థ సరిగమ ఇండియా లిమిటెడ్‌తో కొనసాగుతున్న కాపీరైట్ వివాదంలో కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 1976 నుంచి విడుదలైన 134 సినిమాలకు చెందిన వివాదాస్పద పాటలను ఇళయరాజా స్వయంగా ప్రసారం చేయడం లేదా ఇతరులకు అందుబాటులో ఉంచడంపై తాత్కాలిక నిషేధం విధించింది. ఈ కేసును విచారించిన న్యాయస్థానం, ఇళయరాజాకు తాను స్వరపరిచిన ట్యూన్లపై మాత్రమే హక్కులు ఉంటాయని, సినిమాల్లో వినిపించే పూర్తి సౌండ్ రికార్డింగ్స్‌పై హక్కులు ఉండవని స్పష్టం చేసింది. సరిగమ ఇండియా లిమిటెడ్ వాదన ప్రకారం, 1976 నుంచి 2001 మధ్య విడుదలైన పలు చిత్రాల నిర్మాతలతో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా ఆయా పాటల సౌండ్ రికార్డింగ్స్, సంగీతం, సాహిత్యానికి సంబంధించిన కాపీరైట్ హక్కులు తమకు సంక్రమించాయి.

స్టార్ హీరోయిన్ త్రిష రాజకీయ అరంగేట్రంపై తమిళనాడులో జోరుగా ప్రచారం సాగుతోంది. తిరుచ్చి అసెంబ్లీ ఉపఎన్నికలో అధికార పార్టీ తరఫున ఆమెను బరిలోకి దించే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. తొలుత ఈ స్థానంలో నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ పోటీ చేసే అవకాశాలున్నాయని ప్రచారం జరిగినా, ఆయన తప్పుకోవడంతో కొత్త అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ రెండు నియోజకవర్గాల్లో విజయం సాధించిన అనంతరం తిరుచ్చి స్థానానికి రాజీనామా చేయడంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది.

# త్రిష రాజకీయాల్లోకి వస్తారా?..

## తిరుచ్చి ఉపఎన్నికపై జోరుగా ప్రచారం

ఈ నేపథ్యంలో విజయ్‌కు సన్నిహితురాలిగా పేరున్న త్రిష పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆమెను రాజకీయాల్లోకి తీసుకురావాలని పార్టీ యోచిస్తోందా అనే చర్చలు సాగుతున్నాయి. అయితే త్రిష గానీ, ముఖ్యమంత్రి విజయ్ గానీ ఈ ప్రచారంపై స్పందించలేదు. దీంతో ప్రస్తుతం ఇవన్నీ ఊహాగానాలుగానే మిగిలాయి. ఇక సినీ కెరీర్ విషయానికి వస్తే త్రిష వరుస చిత్రాలతో బిజీగా కొనసాగుతోంది. ఇటీవల విడుదలైన ‘కరుప్పు’ విజయంతో మంచి జోష్‌లో ఉన్న ఆమె, త్వరలో ‘విశ్వంభర’ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే మరికొన్ని కొత్త చిత్రాలకు కూడా ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. నటిగా వరుస విజయాలతో పాటు కొత్త అవకాశాలను అందిపుచ్చుకుంటూ త్రిష తన జోరును కొనసాగిస్తోంది.




## ‘లెనిన్’ టైటిల్‌పై

# అఖిల్ క్లారిటీ

*అఖిల్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ‘లెనిన్’ సినిమా టైటిల్‌పై నెలకొన్న అనుమానాలకు హీరో అఖిల్ తెరదించారు. ఈ చిత్రానికి రాజకీయాలు లేదా కమ్యూనిజంతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ‘లెనిన్’ అనే పేరు వినగానే రాజకీయ నేపథ్యం ఉన్న కథ అనే ప్రచారం జరిగిందని, అయితే ఇది పూర్తిగా కల్పిత కథ ఆధారంగా రూపొందిన యాక్షన్ డ్రామా అని తెలిపారు.*

దర్శకుడు నంద స్వగ్రామమైన రాయలసీమలో ‘లెనిన్ బాబు’ అనే వ్యక్తిని కలిసిన సందర్భంగా ఈ పేరుకు ప్రేరణ లభించిందని అఖిల్ వెల్లడించారు. ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు భావజాలం ప్రభావంతో లెనిన్, స్టాలిన్ వంటి పేర్లు పెట్టడం సాధారణమేనని, అందుకే ఈ టైటిల్‌ను ఎంచుకున్నట్లు చెప్పారు. కథలో ప్రజలను నడిపించే నాయకత్వ లక్షణాలు కలిగిన శక్తివంతమైన యువకుడి పాత్రకు ‘లెనిన్’ పేరు సరిగ్గా సరిపోతుందని భావించి ఖరారు చేసినట్లు వివరించారు. ఈ పేరు కేవలం రాజకీయాలకు సంబంధించినది కాకుండా నాయకత్వానికి ప్రతీకగా ఉంటుందని చిత్రబృందం భావిస్తున్నట్లు తెలిపారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మురళి కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ లవ్ డ్రామాలో అఖిల్ మాస్ లుక్‌తో, సీమ యాసలో కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య తెరకెక్కిన ‘లెనిన్’ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.





# లాస్ ఏంజిల్స్‌లో నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రారంభం..

బాలీవుడ్ సూపర్ స్టార్, కోల్‌కతా నైట్ రైడర్స్ సహ యజమాని షారుఖ్ ఖాన్ చిరకాల స్వప్నం సాకారమైంది. అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన 'నైట్ రైడర్స్ క్రికెట్ గ్రౌండ్' అధికారికంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది తాను ఎప్పటినుంచో కంటున్న కల అని అన్నారు. పొమోనాలోని ఫెయిర్‌ప్లెక్స్‌లో నిర్మించిన ఈ స్టేడియంలో జూలై 1న మేజర్ లీగ్ క్రికెట్‌లో భాగంగా లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్ల మధ్య తొలి మ్యాచ్ నిర్వహించారు. దీంతో తమ సొంత దేశం వెలుపల అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియాన్ని నిర్మించిన తొలి గ్లోబల్ క్రికెట్ ఫ్రాంచైజీగా నైట్ రైడర్స్ గ్రూప్ చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంగా షారుఖ్ ఖాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు కలగా మొదలైన ఈ ప్రాజెక్టు నేడు నిజమైందని అన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వీక్షించే రెండో క్రీడ అయిన క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్‌కు తీసుకురావడం చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ఇది కేవలం క్రికెట్ మైదానం మాత్రమే కాదని, సమాజం, వినోదం, కుటుంబాల కోసం రూపొం దించిన ప్రత్యేక వేదిక అని చెప్పారు. ఈ స్టేడియాన్ని లాస్ ఏంజిల్స్ ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన ఐసీసీ ఛైర్మన్ జై షాతో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నైట్ రైడర్స్ స్పోర్ట్స్ సీఈఓ వెంకీ మైసూర్ మాట్లాడుతూ, ఈ స్టేడియం క్రికెట్ భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. సుమారు 21 మిలియన్ డాలర్ల వ్యయంతో కేవలం 100 రోజుల్లోనే ఈ మైదానాన్ని నిర్మించామని వెల్లడించారు. ప్రస్తుతం 5,000 మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ స్టేడియాన్ని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నాటికి 15,000 సీట్ల సామర్థ్యానికి విస్తరించనున్నట్లు తెలిపారు. టీ20 క్రికెట్ ఒలింపిక్స్ వేదికగా ఈ మైదానం నిలిచే అవకాశముందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మూడు ఫార్మాట్లలోనూ వైభవ్..

## మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ధీమా

ఐపీఎల్ 2026లో సంచలన ప్రదర్శనతో క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపై మాజీ భారత వికెట్‌కీపర్, మాజీ సెలెక్టర్ సబా కరీమ్ ప్రశంసలు కురిపించారు. త్వరలోనే వైభవ్ భారత జట్టు తరపున మూడు ఫార్మాట్లలోనూ ఆడతాడని తనకు పూర్తి నమ్మకం ఉందని ఆయన తెలిపారు.

ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 776 పరుగులు చేసి, 237.30 స్ట్రైక్‌రేట్‌తో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచాడు. విరాట్ కోహ్లీ అత్యుత్తమ సీజన్ తర్వాత గుర్తుండిపోయే ఐపీఎల్ ప్రదర్శన ఏదైనా ఉంటే అది వైభవ్‌దేనని సబా కరీమ్ పేర్కొన్నారు. అగ్రశ్రేణి బౌలర్లను ఎదుర్కొన్న తీరు అసాధారణమని కొనియాడారు. ఐపీఎల్ 2025 వేలానికి ముందే వైభవ్ ప్రతిభ గురించి తనకు సమాచారం వచ్చిందని కరీమ్ గుర్తు చేసుకున్నారు. అతడికి కనీసం ఒక మ్యాచ్‌లోనైనా అవకాశం రావాలని కోరుకున్నానని, తొలి బంతినే ధైర్యంగా ఎదుర్కొన్న తీరు తనను ఆశ్చర్యపరిచిందని చెప్పారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ఆడటమే వైభవ్ ప్రత్యేకత అని వ్యాఖ్యానించారు. రెండో సీజన్‌లో బౌలర్లు ప్రత్యేక ప్రణాళికలతో వచ్చినా అతడు విజయవంతంగా ఎదుర్కొంటాడని తాను ముందే భావించానని కరీమ్ తెలిపారు. రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు.






# ఇంగ్లండ్ సిరీస్‌కు కోహ్లీ సన్నద్ధత..

## సంజయ్ బంగర్ పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ

భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఇంగ్లండ్‌తో జరగనున్న వన్డే సిరీస్ కోసం ముమ్మరంగా సిద్ధమవుతున్నాడు. టీమిండియా మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ పర్యవేక్షణలో కోహ్లీ ప్రత్యేకంగా నెట్ ప్రాక్టీస్ చేస్తుండగా, ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో ఇంగ్లండ్ సిరీస్‌లో కోహ్లీ రీఎంట్రీపై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

ఈ కీలక సిరీస్ కోసం కోహ్లీ ఇప్పటికే ముంబై, అలీబాగ్‌లో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్ టెక్నిక్‌లో అవసరమైన మార్పులు చేసుకుంటూ, ఫామ్‌ను మరింత మెరుగుపర్చుకునే దిశగా సాధన చేస్తున్నాడు. జూలై 14 నుంచి ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు ప్రకటించిన భారత జట్టులో కోహ్లీకి చోటు దక్కినప్పటికీ, తుది జట్టులో అతని ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంది.

టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు ఇప్పటికే వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ ఇకపై పూర్తిగా వన్డే ఫార్మాట్‌పైనే దృష్టి సారించనున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

కోహ్లీ పునరాగమనంపై అభిమానులతో పాటు ఆయన చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ కూడా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంగ్లండ్ సిరీస్‌లో చివరి వన్డే మ్యాచ్‌ను లార్డ్స్ మైదానంలో ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆయన సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. కోహ్లీ నెట్ ప్రాక్టీస్ వీడియోలు ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.





# అమెరికా ఆటగాడి రెడ్ కార్డ్‌తో ఫ్రీ పిజ్జా ఆఫర్

ప్రముఖ పిజ్జా సంస్థ డొమినోస్ అమెరికా ఫుట్‌బాల్ అభిమానులకు భారీ శుభవార్త ప్రకటించింది. ఫిఫా వరల్డ్ కప్ 2026లో అమెరికా జట్టుకు చెందిన ఆటగాడికి రెడ్ కార్డ్ రావడంతో 1 మిలియన్ డాలర్ల (సుమారు రూ.9.49 కోట్లు) విలువైన ఉచిత పిజ్జాలను అందించనున్నట్లు వెల్లడించింది. బోస్నియా అండ్ హెర్జెగోవినాతో జరిగిన రౌండ్ ఆఫ్ 32 మ్యాచ్‌లో అమెరికా స్టార్ స్ట్రైకర్ ఫోలారిన్ బలోగన్‌కు రెడ్ కార్డ్ చూపడంతో ఈ ఆఫర్ అమల్లోకి వచ్చింది. టోర్నీ ప్రారంభానికి ముందే అమెరికా ఆటగాడికి రెడ్ కార్డ్ వస్తే అభిమానులకు ఉచిత పిజ్జాలు ఇస్తామని డొమినోస్ ప్రకటించింది. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకుంటూ 60 వేలకుపైగా మీడియం పిజ్జాలను పంపిణీ చేయనుంది. రెడ్ కార్డ్ వచ్చినప్పటికీ అమెరికా జట్టు అద్భుత ప్రదర్శనతో బోస్నియాపై 2-0 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ 82వ నిమిషంలో మాలిక్ టిల్‌మాన్ చేసిన గోల్‌తో జట్టు రౌండ్ ఆఫ్ 16కు అర్హత సాధించింది. గత 24 ఏళ్లలో వరల్డ్ కప్ నాకౌట్ మ్యాచ్‌లో అమెరికాకు ఇదే తొలి విజయం కావడం విశేషం.

# హార్దిక్ ట్రేడ్‌పై సీఎస్‌కే క్లారిటీ..

## ఇప్పటివరకు ఎలాంటి చర్చలు లేవు



ఐపీఎల్ 2026 సీజన్ అనంతరం ముంబై ఇండియన్స్ స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడింగ్‌పై జోరుగా వినిపిస్తున్న ఊహాగానాలపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) స్పందించింది. హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకొచ్చే అంశంపై ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను దక్కించుకునేందుకు సీఎస్‌కే, కోల్‌కతా నైట్ రైడర్స్ సహా పలు ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఆసక్తి చూపుతున్నాయంటూ కథనాలు వెలువడ్డాయి. అయితే ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కాశీ విశ్వనాథన్ తెలిపారు. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, మేజర్ లీగ్ క్రికెట్ (ఎంఎల్‌సీ) ముగిసిన తర్వాతే జట్టుపై పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తామని, ఆ తర్వాతే ట్రేడింగ్ వంటి అంశాలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న ఎంఎల్‌సీ టోర్నీ జూలై 18తో ముగియనుంది. ఇదిలా ఉండగా, గత మూడు సీజన్లుగా సీఎస్‌కే ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమవుతోంది. 2025లో చివరి స్థానంలో నిలిచిన చెన్నై, 2026లో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. దీంతో జట్టులో నాయకత్వ మార్పు అవసరమనే చర్చలు జరుగుతున్న నేపథ్యంలో హార్దిక్ పాండ్యా పేరును పలువురు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు, కొన్ని మీడియా కథనాల ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మినహా మిగతా ఫ్రాంచైజీలు హార్దిక్‌ను తమ జట్టులోకి తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు ఏ ఫ్రాంచైజీ కూడా దీనిపై అధికారిక ప్రకటన చేయలేదు. ప్రస్తుతం హార్దిక్ ట్రేడింగ్ వ్యవహారం ఊహాగానాలకే పరిమితమైంది.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467